జైలు నుంచి విడుదలైన టిడిపి కార్యకర్తలను పరామర్శించిన బత్యాల, ముక్కా

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నియోజకవర్గంలోని పుల్లంపేట మండలం దళవాయిపల్లి పోలింగ్ కేంద్రం నందు జరిగిన అరాచక వైసిపి ఘర్షణలో దళవాయి పల్లికి చెందిన మల్లు వెంకటేశ్వర్ రెడ్డి అలియాస్ రాజారెడ్డి, సిద్ధారెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, దస్తగిరి, సిద్ధిక్ లపై వైసిపి పోలీసులు అక్రమ కేసులు బనాయించి జైల్లో వేశారు. వారికి బెయిల్ మంజూరై జైలు నుండి ఇంటికి రాగా బుధవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్ రాయులు, రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కా రూపానంద రెడ్డి

-5లో

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

గురువారం 27, జూన్ 2024 | 8 పేజీలు

మార్పుతోనే అందరికీ సరుకులు !

గత ప్రభుత్వంలో గాడితప్పిన ప్రజాపంపిణీ- రూ.లక్షల్లో ప్రజాధనం వృధా

విశాలాంధ్ర-యర్రగుంట్ల : గత వైకాపా ప్రభుత్వం ఆహార భద్రతా చట్టానికి తూట్లు పొడిచింది. చౌకదుకాణాల వ్యవస్థను పక్కన పెట్టి..ఇంటింటికీ రేషన్ పేరుతో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లను (ఎండీయూ) ప్రవేశపెట్టింది. రేషన్ డీలర్ల పొట్ట కొట్టి వైకాపా కార్యకర్తలకు వాటిని కట్టబెట్టింది. ఆ చర్యలతో వ్యవస్థ గాడిన పడిందా ? అంటే..తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రతి నెల 95శాతం మందికి పంపిణీ చేయగా..వైకాపా ప్రభుత్వంలో అది 85శాతానికి పడిపోయింది. మండలంలో ప్రతి నెలా సుమారు 500 మంది కార్డుదారులకు సరుకులు సక్రమంగా అందని పరిస్థితి కొనసాగింది. ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు పంపిణీ చేయకపోయినా.. అధికారులు ఏమీ చేయలేని నిస్సహాయత వ్యక్తం చేశారు. అధికార పార్టీ కార్యకర్తలు కావడంతో మిన్నకుండిపోయారు. కొందరు ఆపరేటర్లు వాహనాన్ని ఒక వీధిలో నిలిపి ఈ-పాస్ యంత్రంలో వేలిముద్రలు వేయించుకొని వెళ్లిపోతే.. తరువాత వేరే వ్యక్తి సరుకులు పంపిణీ చేసిన సంఘటనలు ఉన్నాయి. ఎండీయూ ఆపరేటర్లు వైకాపా కార్యకర్తలే కావడంతో మండలంలో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగింది. ముఖ్యంగా ఎర్రగుంట్ల పట్టణంలో వారి ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. ఇష్టారీతిగా వ్యవహరిస్తూ కార్డుదారులను నిర్లక్ష్యపు సమాధానాలతో తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. కొంతమంది తాము వైకాపా ప్రజాప్రతినిధులమన్న తరహాలో విర్రవీగిన సందర్భాలు కూడా లేకపోలేదు. అయితే ఇంత జరుగుతున్నా మండల రెవెన్యూ అధికారులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోవడం గుర్తుండే ఉంటుంది. పైపెచ్చు సార్వత్రిక ఎన్నికల్లో ఎక్కువ మంది ఆపరేటర్లు వైకాపాకు అనుకూలంగా పనిచేశారు. ఎర్రగుంట్ల మండలంలో మొత్తం 37 చౌకదుకాణాలు ఉండగా 25 గ్రామీణ ప్రాంతాల్లో 12 అర్బన్ (ఎర్రగుంట్ల పట్టణం)లో ఉన్నాయి. ఆయా చౌకదుకాణాలకు సంబంధించి మొత్తం 20,943 మంది కార్డుదారులు ఉన్నారు. మండలంలో 12 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. వీటి నిర్వాహకుల కు ప్రతినెలా ఒక్కొక్కరికి రూ.18వేల వంతున రూ.2.16లక్షలు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఒక్కో ఎండీయూ వాహనాన్ని రూ.7లక్షలకు కొనుగోలు చేశారు. ఇందులో కొంత ఆపరేటర్ వాటా కాగా మిగిలింది బ్యాంకు రుణంగా ఇప్పించారు. అంటే 12 వాహనాల కొనుగోలుకు

-4లో

గంజాయి విక్రయాలు, అక్రమ రవాణాపై

ఉక్కుపాదం

- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు
-వందరోజుల ప్రణాళికతో గంజాయి కట్టడికి శ్రీకారం
- ప్రజలు పోలీసు కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 14500 ద్వారా పోలీస్ శాఖకు సమాచారమివ్వాలి

: జిల్లా ఎస్.పి సిద్దార్థ్ కౌశల్ ఐ.పి.ఎస్ వెల్లడి

విశాలాంధ్ర-కడప : జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలపై కొరడా ఝుళిపించేందుకు వందరోజుల కార్యాచరణ ప్రణాళికతో పోలీస్ శాఖ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్.పి సిద్దార్థ్ కౌశల్ ఐ.పి.ఎస్ తెలిపారు. ప్రణాళికలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ బృందాలతో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో గంజాయి కేసుల్లో ఉన్నవారిని మళ్ళీ నేరాలకు పాల్పడకుండా పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పదే పదే గంజాయి నేరాలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్లు తెరవడంతో పాటు పి.డి యాక్ట్ ప్రయోగించడం జరుగుతుందని ఎస్.పి గారు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నాకాబందీ నిర్వహించి అనుమానితుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల ద్వారా కలిగే అనర్థాలపై కళాశాలలు, విద్యాసంస్థల్లో అవగాహనా సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు గంజాయికి సంబంధించిన సమాచారాన్ని 14500 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్.పి గారు సూచించారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతుందని ఎస్.పి తెలిపారు. గంజాయి నిర్మూలనలో ప్రజలు తమ వంతు సామాజిక బాధ్యత గా పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. గంజాయి సేవించే వ్యసనానికి బానిసగా మారిన వారి సమాచారమిస్తే వారిని రిమ్స్ ప్రభుత్వ సమగ్ర వైద్యశాల లోని డీ అడిక్షన్ కేంద్రానికి తరలించి తిరిగి వారిని సమాజంలో సాధారణ వ్యక్తుల్లా మార్చేందుకు పోలీస్ శాఖ చర్యలు చేపట్టిందని ఎస్.పి సిద్దార్థ్ కౌశల్ ఐ.పి.ఎస్ వివరించారు.

ప్రజా సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి

విశాలాంధ్ర - కమలాపురం : ప్రతి గ్రామంలోని ప్రజల సమస్యలు పట్ల అప్రమత్తంగా కలిగి ఉండాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో మండల సర్వసభ సమావేశాన్ని ఎంపీపీ గండి భారతి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు మండలం లోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి కమలాపురం మండలం అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు అంతకుముందే శాఖాహాల వారీగా వారి పనితీరు సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు ప్రజల సమస్యలు ను సత్వరం పరిష్కరించే విధంగా అధికారులు బాధ్యత అన్నారు. ప్రస్తుతం వాతావరణం మార్పుల వలన గ్రామాలలో జ్వరాలు

-4లో

మాభూమి కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : మా భూమి కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలు నూనె రాజేశ్వరి అధికారు లను వేడుకున్నారు. బుధవారం ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారసత్వ రీత్యా నా తండ్రి నూనె సుబ్బరాయుడు నుండి సర్వహక్కులు గల గోపవరం మండలం మా భూమి సర్వే నెంబర్ 809 లో5.08 ఎకరాల భూమి ఉందని తెలిపారు.ఇందులో 2 ఎకరాల 54 సెంట్లు తమకు వచ్చిం దని చెప్పారు. ఈ భూమి కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఈ భూమికి సంబంధించిన ఎమ్మార్వో కి రెవిన్యూ అధికారులకు తెలుపగా వారిని కూడా బెదిరించడం జరిగిందన్నారు. దీనిమీద మేము కోర్టును కూడా ఆశ్రయించడం జరిగింది. మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని తెలిపారు. మా భూమి మాకు వచ్చేటట్లు అధికారులు మాకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుణీత్ పాల్గొన్నారు.

భాగవత పఠనం ప్రారంభం

విశాలాంధ్ర-పులివెందుల: నంద్యాల జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్ర మైన శ్రీశైలంలో బుధవారం భాగవత పఠనం ప్రారంభించినట్లు భాగవత సమాజం మీడియా చైర్మన్ బాలకృష్ణారెడ్డ తెలిపారు. జులై రెండో తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు కొనసాగించడం వల్ల భక్తులలో ఆధ్యాత్మిక విలువలు పెరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవరచుకోవడంతో పాటు యోగ, ధ్యానం వంటి ఆసనాలు కూడా చేయడం ఆరోగ్యానికి శ్రేయస్కరమన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే భాగవత సప్తాహం కార్యక్రమాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కడప, అనంతపు జిల్లాకు చెందిన సుమారు 90 మంది భాగవతులు కార్యక్రమంలో పాల్గొన్నట్లు బాలకృష్ణారెడ్డి వెల్లడించారు.

సేంద్రియ ఎరువుల వినియోగంతో అధిక దిగుబడి

విశాలాంధ్ర-పులివెందుల: సేంద్రీయ ఎరువుల వినియోగంతో అధిక దిగుబడి సాధించవచ్చని నవభారత్ ఫర్టిలైజర్స్ ఫీల్డ్ ఆఫీసర్ లు శ్రీకృష్ణ, ఎం నాగేంద్రాలు పేర్కొన్నారు. బుధవారం ఆయన పులివెందుల మండల పరిధిలోని చిన్న రంగాపురం, బ్రాహ్మణపల్లె, లింగాల మండలం ఇప్పట్ల,, చిన్నకుడాలగ్రామాలలో రైతు సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగులో రసాయన ఎరువులు అధికంగా వాడటం వలన ఆహార ఉత్పత్తులు విషతుళ్యం అవుతాయన్నారు. రసాయన ఎరువులు వాడకం వలన క్రమక్రమంగా భూములో భూసారం తగ్గిపోయి, పంట దిగుమతులు తగ్గిపోతాయన్నారు. మానవ జంతువాళికి ముప్పు కూడా కలిగిస్తాయని పేర్కొన్నారు. సేంద్రియ జీవన ఎరువులు వాడడం వలన పెట్టుబడులను తగ్గించవచ్చునన్నారు. అలాగే అధిక దిగుబడి సాధించవచ్చునని తెలిపారు. నవభారత్ ఫర్టిలైజర్స్ రైతులు కనిపించే సేంద్రియేరులలో పంటలకు వాడడం వలన భూమిలో మిత్ర పురుగులు అయినటువంటి సూక్ష్మజీవులు అభివృద్ధి చేసి మొక్కలకు కావలసిన పోషకాలను అందించి వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని రైతులకు వివరించారు. నవభారత ఫర్టిలైజర్ సంస్థ 20 సంవత్సరాలుగా సేంద్రియ జీవన ఎరువులను అందిస్తున్నారు అన్నారు. పలు గ్రామాలలో సేంద్రీయ జీవన రైతు అవగాహన సదస్సు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఎస్సార్, ఆర్ ఎం ఎస్, బి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌కు వైఎస్సార్ పేరు తొలగింపు

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణం లోని కూరగాయల మార్కెట్‌కు వైఎస్సార్ పేరు ను తొలగించారు. యధా విధిగా శ్రీరంగనాథస్వామి కూరగాయల మార్కెట్ అను పేరు ఉంచారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ పేరును తొలగించాలన్న ప్రయత్నాలు విఫలమయ్యాయి. రాష్ట్రంలో తాజాగా ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరడంతో ఆ పార్టీ నాయకులు మునుపటి పేరును కొనగించేలా నిర్ణయించారు. వివరాల్లోకి వెళితే.. పులివెందుల పుట్టక నుంచి ఇక్కడ ప్రతి గురువారం సంత జరుగుతుంది. రాయలసీమలో పులివెందుల సంత అంటే ప్రత్యేకత సంతరించుకుంది. స్థానికంగానే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులు క్రయ, విక్రయాలు సాగించేవారు. ఈ క్రమంలో పట్టణం నడిఒడ్డున ప్రసన్న ఆంజనేయస్వామి సమీపంలో సంత ఉండేది. కాలక్రమేణా వ్యాపారులతో పాటు వ్యవసాయ ఉత్పత్తులు పెరగడంతో ఇక్కడ స్థల సమస్య ఏర్పడింది. ఈ ప్రాంత వాసి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సంత మార్పు జరిగింది. ఈ సంతను రంగనాథస్వామి ఆలయం సమీపంలోకి మార్చారు. ఇక్కడ వ్యాపారులకు అన్ని సౌకర్యాలు ఉండేలా మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో రంగనాథస్వామి కూరగాలయ మార్కెట్ అనుపేరును నామకరణం చేశారు. 2014 టీడీపీ ప్రభుత్వంలో ఇదే పేరు కొనసాగింది. 2019 లో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ పులివెందుల అభివృద్ధిపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌కు మరిన్ని అదనపు మెరు గైన సౌకర్యాలు కల్పిస్తూ ఆధునిక మోడల్‌గా తీర్చి దిద్దారు. ఇదే సమయం లో కూరగాయల మార్కెట్‌కు వైఎస్సార్ కూరగాయల మార్కెట్ అన్న పేరు నామకరణం చేశారు. కొన్నాళ్ల తర్వాత ఈ పేరు వివాదాస్పదమైంది. దేవుడి పేరుతో మార్కెట్‌ను కొనసాగించాలంటూ హిందూ ఐక్య వేదిక నాయకులు పట్టుబట్టారు. ఈ నేపథ్యం లో ధర్నాలు, ఆందోళనలు కూడా నిర్వహించారు. ఉన్నతస్థాయి అధికారులకు కూడా విన్నవించారు. కానీ అధికారుల ల్లో చలనం రాలేదు. టీడీపీ ప్రభుత్వ అధికారంలోకి వస్తే పేరు మార్పు కోవచ్చన్న ఆలోచన లతో మిన్నకుండిపోయా రు. ప్రస్తుతం ఎన్డీయే నాయకుల ఆధ్వర్యంలో బుధవారం కూరగాయల మార్కెట్‌కు వైఎస్సార్ పేరును తొలగించి యధావిధిగా మునుపటి పేరుతో కొనసాగించేలా నిర్ణయం తీసుకున్నారు. కూరగాయల మార్కెట్‌కు ఇదే పేరు సూర్య చంద్రులు ఉన్నంత వరకు కొనసాగుతుందని వారు వెల్లడించారు.

ఊపందుకున్న పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-పోరుమామిళ్ళ రూరల్ : వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు ఊపందుకున్నాయి. డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు, మురుగు నీరు నిల్వ లేకుండా చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులను ఆయా పంచాయతీ కార్యదర్శులు చేపడుతున్నారు. ఇప్పటికే మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, ఎంపీడీఓ వరప్రసాద్ రావు, ఈఓపిఆర్ రాజీవ్ రెడ్డి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. రంగసముద్రం, పోరు మామిళ్ళ మేజర్ పంచాయతీల్లో ఎప్పటికప్పుడు దోమల నివారణ చర్యలు చేస్తున్నారు. ఇందుకుగాను ఏఎన్ఎంలు ఆయిల్ బాల్స్‌ను నిల్వ నీటిలో వేస్తున్నారు. ప్రజలకు ఎలాంటి అంటువ్యాధులు దరిచేరకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నర్సెస్ స్ట్రగుల్ కమిటి సభ్యులు

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డిని ఆయన కార్యాలయంలో ఆంధ్రప్రదేష్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. అలాగే కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డికి ఆంధ్రప్రదేష్ నర్సెస్ స్ట్రగుల్ కమిటి ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించి సమస్యల పరిష్కారం చేసేలా చేస్తామని వారికి హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సెస్ లక్ష్మి, సుధ, సువర్ణ, అరుణ, సుబ్బమ్మ, రమణి, రాణి పాల్గొన్నారు.

కౌన్సిల్ ఆమోదం లేకుండా పేరు మార్చడం సరికాదు

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల కూరగాయల మార్కెట్ కు మునిసిపాలిటీ కౌన్సిల్ ఆమోదం లేకుండా కూటమి నాయకులు పేరు మార్చడం సరైన పద్ధతి కాదని మునిసిపల్ వైస్ ఛైర్మన్ వైఎస్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పులివెందుల కూరగాయల మార్కెట్‌ను గత ప్రభుత్వ హయాంలో ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అప్పట్లో స్థానికంగా ఉన్న మార్కెట్ వ్యాపారస్తులు , ప్రజలు మార్కెట్ కు వైఎస్సార్ పేరు పెట్టాలని విన్నవించడంతోనే అప్పట్లో మున్సిపాలిటీ కౌన్సిల్ ఆమోదించి మార్కెట్‌కు దివంగత వైఎస్సార్ పేరు పెట్టడం జరిగిందన్నారు. పులివెందుల మున్సిపాలిటీనే గాక నియోజకవర్గ అభివృద్ధి అప్పట్లో వైఎస్సార్, ఇప్పట్లో జగన్మోహన్ రెడ్డి హయాంలో జరిగిందన్నారు. కానీ టీడీపీ హయాంలో ఏనాడూ పులివెందులకు నిధులు కేటాయించి అభివృద్ధి చేసిన పాపాన పోలేదన్నారు. టిడిపి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే మీ ప్రభత్వ హయాంలో అభివృద్ధి చేసి చూపాలన్నారు. ఇప్పుడు అభివృద్ధి చేసిన వాటికి మీకిష్టమైన పేర్లు పెట్టుకోవచ్చు అంతే కాని వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన,నిర్మించిన వాటికి ప్రభుత్వం మారగానే పేర్లు మార్చడం మంచి పద్ధతి కాదన్నారు.ప్రభుత్వాలు మారడం రాజకీయాల్లో సహజమని కానీ చేసిన అభివృద్ధి శాశ్వతమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వైయస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ ఆఫీజ్, కౌన్సిలర్ కిషోర్ లక్ష్మీ ప్రసన్న, డేనియల్, ఖాదర్, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వీరారెడ్డి, అంకాలమ్మ గుడి దేవస్థానం మాజీ చైర్మన్ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు

పింఛన్ పెంపుపై కేబినెట్ ఆమోదం హర్షణీయం: టీడీపీ

విశాలాంధ్ర-తొండూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంపు ఏప్రిల్ నుంచి అమలు చేస్తూ పాత వాటితో కలిపి ఒక లబ్ధిదారుకు జులై ఒకటిన రూ,7 వేలు ఇచ్చేలా క్యాబినెట్ లో ఆమోదించడం హర్షణీయమని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చింతకుంట నాగిరెడ్డి అన్నారు. తొండూరు మండలంలోని మల్లెల గ్రామంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చరిత్రలో నిలిచేలా పింఛన్లను పరిచయం చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. పింఛన్లు పెంటెట్ తెదేపా దే అన్నారు ఈ నాలుగు వేలు పింఛన్లు అధిక మొత్తం పెంచింది చంద్రబాబేనన్నారు కార్యక్రమంలో రామాంజి పవన్ హరినాథ్ పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

విశాలాంధ్ర-పులివెందుల: చక్రాయపేట మండలం గండిక్షేత్రంలో నిర్వహించే శాశ్వత నిత్య అన్నదాన పథకానికి ప్రొద్దుటూరు పట్టణం రాజా బృందావనం ప్యాలెస్ వాస్తవ్యులు కీ.శే లింగాల మల్లా రెడ్డి కీ.శే ఎరికలమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు లింగాల మల్ రెడ్డి సతీమణి మంగమ్మ రూ. 1,11, 116 రూపాయల చెక్కును ఆఫీస్ సూపరింటెండెంట్ షరీఫ్, జూనియర్ అసిస్టెంట్ రవి చంద్రా రెడ్డిలకు అందజేసిన ట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవల పాటి ముకుంద రెడ్డి తెలిపారు. నిత్య అన్న దాన పథకానికి భక్తులు సహకరించాలని వారు కోరారు.

మత్తు పదార్థాల వాడకం ప్రమాదకరం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక డిగ్రీ కళాశాలలో బుధవారం మత్తుపదార్థాల నియంత్రణ, నివారణ అనే అంశంపై సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీఐ ఈశ్వరయ్య, ఎస్ఈబి సీఐ లీలారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిసలై అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల వాడకం ప్రమాదకరమని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఈశ్వర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ మల్లికార్జున రాజు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి:డిఈవో

విశాలాంధ్ర – సుండుపల్లె : అన్నమయ్య జిల్లా డీఈఓ శివ ప్రకాష్ రెడ్డి బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సుండుపల్లెలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సందర్శించడం జరిగింది. ముఖ్యంగా హై స్కూల్ ప్లస్ లో ఏర్పాటు చేసిన ఎంపీసీ, బైపీసీ గ్రూపులతోపాటు ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో కూడా మాట్లాడి వారికి చక్కగా చదువుకోవాలని పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అలాగే సుండుపల్లి ఉన్నత పాఠశాల అనేక సంవత్సరాల నుంచి ఉన్నత ప్రమాణాలతో విద్యార్థులు చక్కని విద్య అందిస్తు న్నారని చక్కని ఫలితాలు కూడా సాధిస్తున్నారని కొనియాడారు విద్యతోపాటు క్రీడల్లో కూడా ముఖ్యంగా సాఫ్ట్ బాల్ మరియు బేస్‌బాల్‌లో రాష్ట్రస్థాయి మరియు జాతీయస్థాయి పోటీలకు విద్యార్థులు వెళ్లడం అభినందనీయమని అందుకు కృషి చేసిన పీడీలు రవీంద్రనాథ్‌రాజు రాధా రాణిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటరమణతో పాటు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జురికోన ప్రాజెక్టు కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలి -ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

విశాలాంధ్ర -పీలేరు :-దాదాపు 10 సంవత్సరాలకు పైబడి అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న జరికోన ప్రాజెక్టు కార్మికులకు పెండింగ్లో ఏడు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని వారిని ఆప్కాస్‌లో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జరికోన ప్రాజెక్టులో ఆపరేటర్లు, రూట్ వర్క్ కార్మికులు దాదాపు 40 మంది దాకా కార్మికులు పనిచేస్తున్నారని, నెల నెలా కార్మికులకు వేతనాలు చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇచ్చే అరకొర వేతనాలు కూడా సక్రమంగా రాని కారణంగా కార్మికులు కుటుంబ పోషణ కూడా ఇబ్బందిగా మారిందన్నారు. అధికారులు తక్షణమే స్పందించి కార్మికులకు ఇవ్వాల్సిన ఏడు నెలల వేతనాలు చెల్లించాలని, ఈఫిఎఫ్, ఈయస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

శ్రీ భువన విద్యాలయంలో విద్యార్థులకు
హిందూస్థాన్ స్కౌట్స్, గైడ్స్ శిక్షణ

విశాలాంధ్ర- పీలేరు : శ్రీ భువన విద్యాలయంలో విద్యార్థులకు హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ప్రారంభం కానుంది. పై శిక్షణకు అనుమతినిస్తూ హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డి.చిన్నారెడ్డి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ను శ్రీ భువన విద్యాలయం ప్రిన్సిపల్ గుణలక్ష్మికి అందజేశారు. అనంతరం విద్యార్థుల సమావేశంలో స్కౌట్స్ అండ్ గైడ్ శిక్షణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మొట్టమొదటిసారిగా స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణకు అనుమతిస్తూ పీలేరు శ్రీ భువన విద్యాలయాన్ని ఎంపిక చేయడమైనదని అన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ తీసుకున్న విద్యార్థులకు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక దృఢత్వం ఏర్పడుతుందని, కాబట్టి విద్యార్థులు పై శిక్షణను తీసుకోవాలని హితవు పలికారు. హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ అండ్ గైడ్స్ శిక్షణ తీసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేయ బడుతుందని పై సర్టిఫికెట్ పొందిన విద్యార్థులకు10వ తరగతి తర్వాత రిజర్వేషన్లలో ప్రాధాన్యత ఉంటుందని, ఉద్యోగ అవకాశాల మెండుగా ఉంటాయని అన్నారు. డిఫెన్స్ లో ఉద్యోగాలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. శ్రీ భువన విద్యాలయం కరస్పాండెంట్ ఉమా రమాదేవి తన ఉన్నత పాఠశాల విద్యాభ్యాసంలో జాతీయ స్థాయిలో, ప్రిన్సిపాల్ గుణలక్ష్మి రాష్ట్రస్థాయిలో స్కౌట్స్ అండ్ గైడ్ శిక్షణ శిబిరంలో పాల్గొన్న అనుభవం ఉందని కాబట్టి విద్యార్థులు అది సద్వినియోగం చేసుకొని స్కౌట్స్ అండ్ గైడ్ శిక్షణ తీసుకొని వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని అన్నారు. కరస్పాండెంట్ రమాదేవి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్ శిక్షణ పొందడం ద్వారా జీవిత-నైపుణ్యాలు, జట్టు నిర్మాణం, బహిరంగ సాహసం, విద్య మరియు వినోదాన్ని నేర్చుకుంటారు. ఇది వారికి అన్వేషించడానికి, తరగతి గదికి మించిన ప్రపంచాన్ని కనుగొనడంలో మరియు సర్వతోముఖాభివృద్ధికి కూడా సహాయపడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ భువన విద్యాలయం కరస్పాండెంట్ శ్రీమతి ఉమా రమాదేవి, ప్రిన్సిపల్ గుణలక్ష్మీ తోపాటు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత రక్త పరీక్ష

విశాలాంధ్ర -మదనపల్లి: స్థానిక బసినికొండ వద్ద ఉన్న కూరపర్తి ఆశ్రయంలోని 100 మంది చిన్నారులకు హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో ఉచిత రక్తవర్గీకరణ చేసి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ రక్తదానం యొక్క ప్రాముఖ్యత, అపోహలపై చిన్నారులకు వివరించి, ఉచిత రక్తవర్గీకరణ నిర్వహించి గుర్తింపు కార్డులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కూరపర్తి సాయి చైతన్య ఆశ్రమ నిర్వాహకులు పద్మనాభ రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ చిన్నారులకు రక్తవర్గీకరణ నిర్వహించిన హెల్పింగ్ మైండ్స్ వారికి కృతజ్ఞతలు తెలుపుతూ, యువత సేవా మార్గంలో నడవడానికి హెల్పింగ్ మైండ్స్ కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్,పవన్ ,వాలంటరీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రెడ్డి కృష్ణ కూరపర్తి ఆశ్రమ ఉపాధ్యాయులు రమణ, నాగార్జున, అమరావతి, సుగుణ,శరణ్య,శాంతి, పాపమ్మ పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

విశాలాంధ్ర– సిద్ధవటం : సిద్ధవటం మండలంటక్కోలి గ్రామపంచాయతీ జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రక్కన ఉన్న పెన్నా నదిలోకి వెళ్లే రహదారి నుండి ప్రతిరోజు నిత్యం ఇసుక వాహనాలతో అల్లాడి పోతున్నామని ఆ ప్రాంత పొలాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక తరలించడం వల్ల భూగర్భ జలాలు అంతరించిపోయే ప్రమాదం ఉందని పంట పొలాలకు వెళ్లే బోర్లు వద్ద ఇసుక అక్రమ దారులు తరలిస్తున్నారని రైతులు వాపోయారు టక్కోలి పెన్నా నది నుండి ఇసుక జాతర మొదలైందని దేగల వారి పల్లె గ్రామంలో ఇసుక పూర్తిగా అక్రమ రవాణా నిలిచిపోయిందని ఈ ప్రాంతంలో కూడా అదే విధంగా గట్టి చర్యలు తీసుకొని మా పంట పొలాలను కాపాడాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అంబేద్కర్ విదేశీ విద్య అనేపేరు పెట్టడం హర్షనీయం

విశాలాంధ్ర– పీలేరు : అంబేద్కర్ విదేశీ విద్య అనేపేరు పెట్టడం హర్షనీయమని రాష్ట్ర అధికార ప్రతినిధి వీరభద్రయ్య అన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చింతపర్తి శివయ్య ఆధ్వర్యములో మీడియా సమావేశంలో ఏర్పాటు చేయడం జరిగినది ఈ సమావేశానికి రాష్ట్ర అధికార ప్రతినిధి వీరభద్రయ్య రావడం జరిగినది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు.పీలేరు శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వము అంబేద్కర్ విదేశీ విద్య అనేపేరును తొలగించి దానికి జగన్ విదేశీ విద్యగా పేరు మార్చడం శోచనీయమని అన్నారు. కొత్తగా ఏర్పడిన తెలుగు దేశం ప్రభుత్వం విదేశీ విద్యకు. అంబేద్కర్ పేరును పునరుద్ధరణ చేసి జీ ఓ ఇవ్వడంపై ఆనందంగా ఉందన్నారు.అలాగే గతములో ఎస్సీ ఎస్టీ లకు చెందిన 27 పథకాలను అమలు చేయాలని అలాగే ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను 100 శాతం ఖర్చు చెయ్యాలని బడుగు బలహీనవర్గాలకు రుణాలు మంజూరు చేసి ఎస్సీ, ఎస్టీలకు జీవితాలు బాగు పడేలాగే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో మండల ఉపాధ్యక్షులు పూజారి నాగేంద్ర నాయకులు సూర్యనారాయణ, కిరణ్ కుమార్, ప్రకాష్, రాజన్న, రమణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పుష్ప పల్లకిపై కళ్యాణ వెంకటరమణ స్వామి

విశాలాంధ్ర-రామసముద్రం: మండలంలోని మినికి గ్రామ ములో వెలసిన శ్రీ దేవి భూదేవి సమేతుడైన శ్రీ కళ్యాణ వెంకట రమణ స్వామి బుధవారం పుష్ప పల్లకిపై ఊరేగారు. ఉదయం ఆలయ అర్చకులు సురేష్ బట్టర్ శ్రీధర్ బట్టర్ స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు అర్చనలు చేశారు .ప్రాకారోత్సవం వైభవంగా నిర్వ హించారు. స్థానిక పురవీధులలో అమ్మవార్లతో స్వామి పుష్ప పల్లకిపై కనుల విందుగా ఊరేగారు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు.

మిట్స్ విద్యార్థులకు కాంచీపురంలో ఇంటర్ షిప్

విశాలాంధ్ర -మదనపల్లె: మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ లో నందు ఎలెక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో మూడవ సంవత్సరం చదువుతున్న కె. స్వాతి, పి. షాకీర్ హుస్సేన్, పి.తేజశ్రీ, బి. సాయి హర్షిత, కె. సింధు, పి.శ్రీనివాసులు, ఆర్ వినోద్ కుమార్ మరియు ఎస్. గౌతమి లు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మాన్యు ఫ్యాక్చరింగ్, కాంచీపురంలో ఇంటర్న్షిప్ లో పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. ఈ ఇంటర్న్‌షిప్ సమయంలో విద్యార్థులు వి ఎల్ ఎస్ఐ డిజైన్ ప్రాజెక్ట్‌లో పని చేస్తారని ఆయన అన్నారు. ఈ విద్యార్థులు 45 రోజుల పాటు ఈ ఇంటర్న్‌షిప్‌లో పాల్గొంటారని ఆయన అన్నారు. ఎంపిక అయిన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి మరియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ రాజశేఖరన్ మరియు అధ్యాపకులు అభినందనలు తెలియజేసారు.

బస్ షెల్టర్స్ లేక ప్రయాణికుల ఇక్కట్లు

వాన, ఎండ కాలంలో పరిస్థితి దుర్భరం- రోడ్డుపై నిలువలేక అగచాట్లు

విశాలాంధ్ర - జమ్మలమడుగు : జమ్మలమడుగు పట్టణంలో బస్ షెల్టర్స్ లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. జమ్మలమడుగు డివిజన్ కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. నిత్యం జమ్మలమడుగు దూర ప్రాంతాలకు వేలాది మంది ప్రయాణికులు రాక పోకలు సాగిస్తుంటారు. వందలాది బస్సులో ఇక్కడి నుండి ప్రొద్దుటూరు, కడప, తిరుపతి, విజయవాడ, చెన్నై, బెంగళూర్ ,ముదునూరు, పులివెందల తదితర ప్రాంతాలకు పట్టణాలకు, నగరాలకు ప్రయాణికులు నిత్యం వెళ్తుంటారు. ఆర్టీసీ బస్టాండ్ మరియు తాడపత్రి బస్టాండ్ లో తప్ప పట్టణంలో ఎక్కడ ప్రయాణికులు కూర్చోడానికి చిన్నపాటి బస్ షెల్టర్ లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రయాణికులతో రద్దీగా ఉన్న పాత బస్టాండ్ లో ఉన్న బస్ స్టాప్ వద్ద ప్రయాణికులు టీ స్టాల్స్ మాటున, దుకాణాల క్రింద వాన కాలంలో మరియు ఎండ కాలంలో బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. రానున్న వర్షాకాలం లో అయితే ప్రయాణికులకు మరిన్ని ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రధాన రహదారుల్లో బస్ షెల్టర్ లేని వైనం: పట్టణంలో ప్రధానంగా పాత బస్టాండ్ నుండి ప్రొద్దుటూరు, కడప, తిరుపతి, చెన్నై తదితర ప్రధాన ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో స్థలం ఉన్నప్పటికీ పాలకులు బస్ షెల్టర్ నిర్మించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రాంతం ప్రయాణికులతో పాటు విద్యార్థినీ విద్యార్థులతో నిత్యం రద్దీగా ఉంటుంది. గతంలో ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి బస్ షెల్టర్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు అది కార్య రూపం దాల్చలేదు. ముద్దనూరు, పులివెందుల, గండికోట తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులకు బస్ షెల్టర్ ఏర్పాటు నోచుకోలేదు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాల్సిన చాలా మంది ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. గంటల తరబడి ప్రయాణికులు బస్సు ల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి. ప్రయాణికులు ఎండలకు వాన కాలంలో చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చొరవ తీసుకొని రద్దీగా ఉండే ప్రాంతాల్లో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రజలు ఎక్కడ వేచిఉండాలో అర్థం కాని పరిస్థితి. అలాగే మరుగుదొడ్లు లేక పోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ,మున్సిపల్ అధికారులు సమస్య ను చూస్తున్నారే తప్ప ఎవరూ పట్టించు కోవడం లేదు. ప్రయాణికుల ఇక్కట్లను గుర్తించి ఇప్పటికైనా ఎమ్మెల్యే ఆదినారా యణ రెడ్డి జమ్మలమడుగు మున్సిపాలి టీ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ స్పందించి బస్ షెల్టర్ ను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గంటల కొద్దీ నిలబడు కోవాలి: పట్టణంలోని ముద్దనూరు రోడ్డు, పాత బస్టాండ్ నందు బస్ షెల్టర్ వద్ద బస్సు షెల్టర్ ను ఏర్పాటు చేయాలి. గ్రామీణ ప్రాంతం నుండి అనేకమంది పట్టణానికి వస్తుంటారు. నిలబడేందుకు సైతం ఇక్కడ స్థలం లేదు. ఉన్న బస్సు షెల్టర్ ను అధికారులు కూల్చివేశారు. బస్సుల కోసం గంటల తరబడి ఉండాల్సి వస్తుంది.

బాబా అలీ.జమ్మలమడుగు.

బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి: అధికారులు పట్టణంలో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు చాలా ఇబ్బందులకు పడుతున్నారు. వర్షాకాలం,ఎండాకాలంలో చాలా ఎక్కువగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కనుక వెంటనే అధికారులు స్పందించి బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలి.

ప్రసాద్ ,సిపిఐ నాయకులు. జమ్మలమడుగు.

విద్యార్థులకు పెన్నులు, అట్టలు పంపిణీ

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: నేడు మాజీ మున్సిపల్ చైర్మన్ వీఎస్ ముక్తియార్ పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని మౌలానా ఆజాద్ వీధుల్లోని ఉర్దూ హైస్కూల్ విద్యార్థులు 300మందికి ఉచితంగా పెన్నులు, ప్యాడులు(అట్టలు) పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం సురేష్ నాయుడు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా సురేష్ నాయుడు, ముక్తియార్లు విధ్యార్థులకు పంపిణీ చేశారు. విధ్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణగా ఉండి చదువుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఖలీల్ బాషా, బాబయ్య, హాంకాంగ్ ఖలీల్, రామకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆలయంలో ఆస్థాన హోమాలు

విశాలాంధ్ర - బ్రహ్మంగారి మఠం : ప్రముఖ పుణ్యక్షేత్ర మైన వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయం నందు ఉదయం బ్రహ్మంగారి ఆలయంలో ప్రత్యేక తాత్కాలిక ఆస్థానం హోమములు కార్యక్రమాలు వేద పండితుల మధ్య ఆలయ ప్రధాన అర్చకులు వీరభద్ర స్వామి సిద్ధాంతి జనార్దన్ ఆచారి , చంద్రశేఖర్ ఆచారి వారి బృందంతో కలిసి కాకినాడ విశ్వబ్రాహ్మణ పురోహితులు సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు. అందులో భాగంగానే వేద పండితులతో దిగవంత మఠాధి పతులు కుమారులు, వెంకటాద్రి స్వామి దంపతులతో వీరభద్ర స్వామి , దంపతులుమారుతిమహాలక్ష్మి వారి కుమారులు తో కలిసి ప్రత్యేక పూజలు లింగార్చన హోమములు భద్ర మండపం రుద్రా హోమం కార్యక్ర మం హోమం మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్ణయించారు ప్రత్యేకంగా సిద్ధాంతం సుమారు 50 మందితో ప్రత్యేక హోమం చేపట్టారు. అందులో భాగ గానే శ్రీ జగన్మాత ఈశ్వరిదేవి ఆలయ మఠాధిపతులు శ్రీ శ్రీ వీర శివకుమార్ స్వామి దంపతులతో కలిసి ప్రత్యేక హోమం లో పాల్గొన్నారు రాత్రి కూడా ప్రత్యేక హోమా ములు ప్రత్యేక పూజలు తోపాటు 10001 దీప అర్చన సహస్రనామ అర్చనలు ప్రత్యేక పూజలు కార్యక్రమాలను ఉంటాయని ఈ కార్యక్రమంలో దంపతులతోపాటు భక్తులు ప్రత్యేకంగా పాల్గొని స్వాముల వారి ఆశీస్సులతో ప్రత్యేక కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసిన బ్రహ్మంగారిమఠం మరియు జిల్లా దేవదాయ శాఖ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆలయ ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలోని ఆలయ మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి పర్యవేక్షణలో ప్రత్యేకంగా కార్యక్రమాలు చేపట్టారు భక్తులకు ప్రత్యేక కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజలు అభిషేకాలు తీర్థప్రసాదాలను వేద పండితుల మధ్య అందించే విధంగా చూచారు.

మఠాధిపతులకు సన్మానాలు :ప్రముఖ పుణ్యక్షేత్రమైన వీరబ్రహ్మేంద్ర స్వామి ల వారి ఆలయంలో పూర్వపు మఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ వీర భోగ వసంత వెంకటేశ్వర స్వామి కుమారులు, వెంకటాద్రి స్వామి, భద్రయ్య స్వాముల, వీరభట్లమ్మయ్య వారిని దత్తాత్రేయ, స్వామి ను, దిగవంత మఠాధిపతులు రెండో భార్య మారుతి మహాలక్ష్మి ప్రత్యేకంగా సన్మానించారు అదేవిధంగా జగన్మాత ఈశ్వరి దేవి ఆలయ మఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ వీర శివకుమార్ సోమల వారిని ప్రత్యేకంగా సన్మానించారు తూర్పు గోదావరి జిల్లా కాకినాడ అర్చకులు పురోహితులు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిద్ధాంతులు జనార్ధన్ ఆచారి చంద్రశేఖర్ ఆచారి ఆలయ ప్రధాన అర్చకులు వీరభద్ర స్వాములవారు అర్చకులు పాల్గొన్నారు.



ఎన్నికల నిధులు స్వాహా చేసిన ఆర్.ఓ.పై విచారణ జరపాలి: సీపీఐ

విశాలాంధ్ర-అట్లూరు/ బద్వేల్ : సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కొరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ బద్వేలు నియోజకవర్గానికి కేటాయించిన నిధులలో దాదాపు కోటి రూపాయలు ఎన్నికల అధికారి. స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయని, ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. బుధ వారం సాయంత్రం బద్వేలులోని స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వి.వీరశేఖర్, మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల్లో ఎన్నికల నిర్వహణ కొరకు ఎన్నికల కమిషన్ కోటి 80 లక్షల రూపాయలు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రిని కొనుగోలు చేయడంతో పాటు, ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి రెమ్యూనరేషన్ కూడా చెల్లించాలన్నారు. అయితే ఎన్నికల సిబ్బందికి పూర్తిస్థాయిలో రెమ్యూనరేషన్ చెల్లించలేదని ఆయన ఆరోపించారు. ఎన్నికల విధులకు గాను రిజర్వుగా నియమించబడిన సిబ్బందికి కూడా ఏ ఒక్కరికి రెమ్యూనరేషన్ చెల్లించకుండా ఎగనామం పెట్టారని విమర్శించారు. వీరితోపాటు రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసిన రెవిన్యూ సిబ్బందికి సైతం డ్యూటీకి ఆర్డర్స్ వేసిన ఆర్.ఓ. కు రెమ్యూనరేషన్ చెల్లించాలనే కనీస విజ్ఞత లేకపోవడం విడ్డూరం. ఎన్నికల నిధులకు ఆడిట్ లేని కారణంగా అధికారులు ఇష్టా రాజ్యాంగా వ్యవహరించారని ఆరోపించారు. బద్వేలు నియోజకవర్గ ప్రాంతం చైతన్య వంతమైన ప్రాంతం. సామాజిక ఉద్యమాలకు పుట్టినిల్లు. పెద్ద ఎత్తున తప్పుడు బిల్లులు సమర్పించి నిధులను కాజేశారనే గుస గుసలు ఉద్యోగులలోను ప్రజలోను బలంగా ఉన్నా యి. సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లించకుండా ఇలా లక్షలాది రూపాయలను అధికారులు స్వాహా చేయడం దుర్మార్గమైన చర్య అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.. జిల్లా ఎన్నికల అధికారి అయిన జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో పాటు రిజర్వులో ఉండి, డ్యూటీలు కేటాయించబడని ఉద్యోగులు. ఉపాధ్యాయులు. ఇరిగేషన్ శాఖ అధికారులకు రెమ్యూనరేషన్ చెల్లించాలని. ఇందుకు బాధ్యులైన ఆర్.ఓ. తాహశీల్దార్. డిప్యూటీ తాహశీల్దార్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు,

..అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి) ఇతర సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉపాధి. విద్యాపర్యాల అధికారులు. విద్యుత్ శాఖ పశువర్ధక శాఖ వైద్య శాఖ సిబ్బంది తదితర శాఖల నుంచి వచ్చిన ఫిర్యాదును సంబంధిత అధికారులతో ఆయన చర్చించారు. పరిష్కారం చూపే దిశగా ఆయన మాట్లాడారు. అంతకు ముందే జడ్పిటిసి సుమిత్ర రాజశేఖర్ రెడ్డి ఎంపీపీ గండి భారతి స్థానిక అధికారులు ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛాల అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సుబ్రహ్మణ్యం మండల అభివృద్ధి అధికారిని సరస్వతి మండల ప్రత్యేక అధికారి ఏవి నరసింహారెడ్డి ఉప ఎంపీపీ చెన్నకేశవరెడ్డి గ్రామ సర్పంచులు ఎంపీటీసీలు, జడ్పీటీసీలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ

విశాలాంధ్ర - కమలాపురం : స్థానిక రైల్వే గేట్ సమీపంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం కర్నూల్ జిల్లాలో ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న పట్టెం గురు ప్రసాద్ కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి మర్యాదపూర్వకంగా పూలదండలు శాలువాలు పుష్పగుచ్ఛాలతో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు దివాకర్ రెడ్డి జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్ బాషా బిజెపి నాయకుడు రాంప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్పుతోనే అందరికీ సరుకులు !

(మొదటి పేజీ తరువాయి) రూ. 84లక్షలు వెచ్చించారు. ఇంటింటికీ రేషన్ పేరుతో వీధుల్లో వాహ నాలు నిలిపి సరుకులు ఇచ్చేవారు. ప్రతి ఇంటికి వెళ్లిన దాఖలాలే లేవు. ఎండీయూ ఆపరేటర్‌కు ప్రతి నెలా వేతనం ఇవ్వడంతో పాటు రేషన్ డీలర్‌కు కమీషన్ చెల్లించేవారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి సరుకులు చౌకదుకాణానికి చేరగా అక్కడి నుంచి ఆపరేటర్లు వాహనా ల్లో నింపుకొని వెళ్లి పంపిణీ చేసేవారు. ఈ విధానం పూర్తిగా విఫలమైంది.

ప్రజాధనం వృధా: ప్రజాధనం వృధా చేసి..ఎండీయూ వాహనాలను వైకాపా కార్యకర్తలకు కట్టబెట్టిన వైనంపై తెదేపా ప్రభుత్వం ఆగ్రహంగా ఉంది. దాంతో ఈ వ్యవస్థను రద్దు చేసి ఆహార భద్రతా చట్టం మార్గదర్శకాల ప్రకారం చౌకదుకాణాల వద్దే సరుకులు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. వైకాపా హయాంలో బియ్యం, పంచదార, గోధుమపిండి మాత్రమే ఇచ్చి మిన్నకుండిపోగా కూటమి ప్రభుత్వం వాటితో పాటు వంటనూనె, కందిపప్పు రాయితీ ధరలకు పేదలకు పంపిణీ చేయాలని యోచిస్తోంది. మండలంలోని చౌకదుకాణాలకు సరఫరా జరుగుతోం దని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. జూలై నెల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్డుదారులకు సరుకులు పంపిణీ చేస్తామని వారు చెబుతుండడం గమనార్హం.

గంజాయి వద్దు, ఆరోగ్యమే ముద్దు

విశాలాంధ్ర-సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలో బుధవారం మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన ర్యాలీ కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఫోర్స్మెంట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు మండల ఎస్సై పెద్ద ఓబన్న జిల్లా పరిషత్ హై స్కూల్ హెడ్మాస్టర్ శ్రీరాములు విద్యా కమిటీ స్కూల్ కమిటీ చైర్మన్ మునిస్వామి స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరు కూడా గంజాయి మాదకద్రవాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండడానికి దుర అలవాట్లకు దూరంగా ఉండాలని మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు గంజాయి వద్దు ఆరోగ్యం ముద్దు అంటూ ఆరోగ్యవంతమైన సమాజంలో విద్యార్థులు అభివృద్ధి చెందాలన్నారు. విద్యార్థులు సిగరెట్ గంజాయి జోలికి వెళ్ళకూడదు అన్నారు మండల ఎస్సై పెద్ద ఓబన్న మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులు ప్రతి ఒక్కరూ విద్యా రంగంలో ఉన్నత స్థాయి ఎదగాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ముఖ్యంగా విద్యార్థులు క్రమశిక్షణతో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను గ్రహించి విద్యా రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్, శ్రీ సాయి విద్యార్థులుఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర- మదనపల్లి : మదనపల్లె పట్టణంలో పారిశుధ్యం పై, రోడ్లపై ఫ్లైవర్ల నిర్మాణం పై దృష్టి సారించాలని ఎమ్మెల్యే షాజహాన్ బాష మున్సిపల్ కమిషనర్, అధికారులకు ఆదేశించారు. బుధవారం కదిరి రోడ్ లోని టిప్పు సుల్తాన్ కాంప్లెక్స్ దగ్గర మురికి కాలువలను మున్సిపల్ అధికారులతో కలిసి సందర్శించారు. మురికి నీటి కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వాటిని తక్షణమే పునరుద్ధించాలని తెలిపారు. మేదరు వీధి, ఆంజనేయ స్వామి గుడి దగ్గర బ్రిడ్జ్ కాలువను, కదిరి రోడ్ టిప్పు సుల్తాన్ గ్రౌండ్ పరిధిలో కాలువలు, మ్యాంగో ఫ్రూట్ మండి పరిధిలో మరియు బైపాస్ రోడ్డు మున్సిపాలిటీ వేస్ట్ యార్డ్ పరిసర ప్రాంతాలలోని కాలువలను అధికారులతో వెళ్లి పర్యవేక్షించి మదనపల్లె వెంటనే పారిశుధ్యం మెరుగు కు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం లో అధికారులతో మాట్లాడుతూ పట్టణంలో ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కరించాలని తెలిపారు. పై శానిటేషన్ పై మాట్లాడుతూ ప్రతిచోట గ్యాంగ్ వర్క్ నిర్వహించాలని సిబ్బంది ని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కమిషనర్ ప్రమీల, అధికారులు ఉన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి: డిఎస్పీ

విశాలాంధ్ర- మదనపల్లి : ప్రజలు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని మదనపల్లె డిఎస్పీ ప్రసాద్ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మదనపల్లెలో పోలీసులు విద్యార్థులతో కలిసి ర్యాలి నిర్వహించారు. స్థానిక 2టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఆర్టీసీ బస్టాండు నుంచి బెంగళూరు బస్టాండు వరకు పోలీసులు, విద్యార్థులతో కలిసి డ్రగ్స్ వద్దు భవిష్యత్తే ముద్దు అన్న నినాదంతో ప్లకార్డులు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ.. ప్రజలు మత్తు పదార్థాలకు అలవాటు పడ్డం వల్ల భవిష్యత్తు నాశనం అవుతుం దన్నారు. యువత డ్రగ్స్ వినియోగించడం వల్ల సమాజం తిరోగమనంలో పయనిస్తుందని వివరించారు. సామాజిక, మానసిక, శారీరక అనారోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా దేశ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కావున ప్రతీ ఒక్కరూ మాదక ద్రవ్యాలను పకడ్బందీగా అరికట్టేందుకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన ర్యాలీలో సీఐలు యువరాజు, వల్లి భాష, శేఖర్, సద్గురుడు, ట్రాఫిక్ సిఐ కృష్ణయ్య, ఎస్సైలు వెంకటసుబ్బయ్య, వెంకటేష్, రవికుమార్, పోర్డు లలితమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు సరఫరా చేయాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కమలాపురం : స్థానిక ఏ డి ఏ కార్యాలయ సభా భవనం నందున బుధవారం నియోజకవర్గం పరిధిలోని వ్యవసాయ అధికారి సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం అందించే రాయితీలు ప్రతి రైతుకు అందేలా అధికారు లు పనితీరు కృషి కృషి చేయాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలోని మండలాల వారిగా ప్రస్తుతం సీజన్ కు సంబంధించి రైతులకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలు ఎరువులు, వివరాలు అందుబాటులో ఉండా లన్నారు. విత్తనాలు ఎరువుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అధికారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఎరువులు విత్తనాలు సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు అనంతరం మట్టి నమూనా ల ల్యాబ్ పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది మట్టి నమూనాల యొక్క పనితీరు గురించి స్థానిక ఎమ్మెల్యేకి వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నియోజవర్గ రైతు అధ్యక్షుడు చాపాడు ప్రభాకర్ రెడ్డి ఏడిఏ ఏవి నరసింహారెడ్డి వ్యవసాయ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

..పరామర్శించిన బత్యాల, ముక్కా

(మొదటి పేజీ తరువాయి) దళవాయి పల్లిలోని భాధితుల ఇండ్లకు వెళ్లి పరామర్శించారు. బత్యాల చంగల్ రాయులు, ముక్కా రూపానందరెడ్డి దళవాయిపల్లి గ్రామంలో అడుగుపెట్టడంతో బాధితులలో ఉత్సాహం పెరిగి కొండంత ధైర్యం వచ్చింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీకు మేము అండగా ఉంటామని బాధితులను భుజం తట్టి భరోసా ఇచ్చారు. ఎన్నికలలో వైసిపి ఓడిపోతుందని కక్షపూరితంగా వ్యవహరించి పోలీసుల ద్వారా తెలుగుదేశంపార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించిన వైసిపి వారిని, అక్రమ కేసులు పెట్టిన పోలీసులను ఏ ఒక్కరిని వదిలి పెట్టమని హెచ్చరించా రు. అక్రమ కేసులన్నీ వెలికి తీస్తామన్నారు. అరాచక వైసిపి కుట్రలను ఎక్కడికక్కడ భగ్నం చేస్తామన్నారు. అక్రమ కేసులన్నీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి, హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకుపోయి అక్రమ కేసులన్నీ కొట్టేయిస్తామన్నారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్, పోతురాజు నవీన్, నార్జాల హేమ్ రాజ్, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, కల్లెం రమణారెడ్డి, జోగినేని మణి, తమెదపాటి తిరుపాలు, గడికోట సుబ్బరాయుడు, సాలవ రమణరాజు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మైలుపల్లి రాచపల్లి బ్రిడ్జిని పరిశీలించిన రూపానందరెడ్డి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నియోజకవర్గం చిట్వేల్ మండలంలోని మైలుపల్లి రాచపల్లి బ్రిడ్జిని బుధవారం తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్ఛార్జి ముక్కారూపానందరెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం పై అర్ అండ్ బి డిఇఇ జయప్రకాష్,జెఇ నరేంధర్ రెడ్డి లతో కలిసి చర్చించారు. బ్రిడ్జి నిర్మాణానికి ఎస్టిమేట్ వేసి పంపాలని అధికారులను ఆదేశించారు. కోడూరు చిట్వేల్ మధ్య జరుగుతున్న రెండు వరుసల ప్రధాన రహదారి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని అదికారులను, కాంట్రాక్టర్ సుబ్బారెడ్డి లను అదేశించారు.

రూపానందరెడ్డి వెంట జనసేన, టిడిపి నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, జోగినేని మణి,కట్టా గుండయ్యనాయుడు, బత్తిన వేణుగోపాల్ రెడ్డి,వేమన సుబ్రమణ్యంనాయుడు, తల్లెం రమణారెడ్డి, తమెదపాటి తిరుపాలు, గడికోట సుబ్బరాయుడు తదితరులు బ్రిడ్జి, ప్రధాన రహదారి పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల రాజిచేసుకోవాలి

విశాలాంధ్ర- బద్వేలు : హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టు ఉత్తర్వుల మేరకు 29-06- 2024 వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ను పురస్కరించుకొని బద్వేల్ కోర్టు పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లో అధికారులకు ప్రత్యేకంగా డి.ఎస్.పి మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది ఈ మీటింగ్ లో సీనియర్ సివిల్ జడ్జి, వై జె పద్మశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి గాయత్రి మాట్లాడుతూ కేసులలో ఉన్నవారికి లోక్ అదాలత్ పరిజ్ఞానాన్ని తెలిపి దానివల్ల ఇరువు పార్టీల కక్ష దారులకు ఎంత ఉపయోగము తెలిపి మరిన్ని కేసులను రాజీ చేయాలని ప్రతి కక్షిదారులు కేసులో రాజీపడి సంతోషకరమైన జీవితం జీవించే విధంగా చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఏపీపీ ఉమాదేవి కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫలితాలలో శ్రీ లక్ష్మీనరసింహ విద్యార్థులు విజయం

విశాలాంధ్ర - కార్వేటినగరం : ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో శ్రీ లక్ష్మీనరసింహ విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారని కరస్పాండెంట్ దిలీప్ కుమార్ తెలియజేశారు. ఎంపీసీలో ఢిల్లీ, ఐశ్వర్య,దిలీప్ కుమార్ 462 మార్కులతో మొదటి స్థానంలో నిలిచారు. అలాగే బైపీసీలో కావ్య 417 మార్కులతో మొదటి స్థానం వచ్చినట్లు పేర్కొన్నారు. డైరెక్టర్లు ధనంజయ రెడ్డి,పురుషోత్తం సంతోషం పరిచారు.

వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర -చిత్తూరు : నగరంలో లాడ్జిలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్తూరు వన్ టౌన్ పోలీస్ తెలిపారు. నగరంలోని సుందరయ్య వీధిలో ఓ లాడ్జిలో సుమారు 40 సంవత్సరాలు వయసు కలిగిన వ్యక్తి ఫ్యాన్ కు గురివేసుకొని ఆత్మకు చేసుకున్నట్లు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం లాడ్జి గదిలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని లాడ్జి సిబ్బంది గమనించి పోలీసులు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ఆస్పత్రి కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సప్లమెంటరీ ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత

విశాలాంధ్ర - చౌడేపల్లి : స్థానిక జిల్లా పరిషత్ స్కూల్ ప్లస్ ఉన్నత పాఠశాలలో బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సప్లమెంటరీ పరీక్షా ఫలితాలలో 100శాతం స్కూల్ ప్లస్ చౌడేపల్లి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు వైస్ ప్రిన్సిపాల్ అమర్నాథ్ రెడ్డి ప్రసంగిస్తూ ఇంటర్మీడియట్లో 100శాతం ఉత్తీర్ణత సాధించడం శుభపరిణామన్నారు .విద్యార్థులను ఆయన వారిని అభినందించారు పాఠశాలలో కేవలం బాలికలు మాత్రమే కాబట్టి విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించి ప్రభుత్వ కళాశాలలో చేర్పించవలసినదిగా తెలియజేశారు. తాము ప్రత్యేకమైనటువంటి తరగతులు నిర్వహించడం వల్లనే ఈ ఫలితాలు సాధ్యమైనాయని ఆయన తెలిపారు. కావున బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ బాలికల కళాశాలలో చేర్పించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు నాగరాజు రెడ్డి విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్లస్ ఉపాధ్యాయులు సోమశేఖర్ రమణప్ప విజయలక్ష్మి రాజన్న సుదర్శన్ పాల్గొన్నారు.

విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర - నాయుడుపేట : నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనమునందు బుధవారం నాయుడుపేట విద్యాశాఖ అధికారులు, పట్టణ,రూరల్ పరిధిలో ఉన్న అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఎంఈఓ శాంతి మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు.విద్య ప్రవేశం (పిల్లలందరూ బడిలో ఉండాలి)కార్యక్రమంలో భాగంగా మండలంలోని హైస్కూల్,అప్పర్ ప్రైమరీ స్కూల్,ప్రైమరీస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఈసమావేశంలో పాల్గొన్నారు. ఎంఈఓ మునిరత్నం ప్రధానోపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలోని వ్యక్తులందరూ చదువుకున్నవారైతే మెరుగైన సమాజ నిర్మాణం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులు పిల్లలుకు నాణ్యమైన విద్యను బోధించాలని సూచించారు.రాష్ట్రప్రభుత్వం బడిఈడు గల పిల్లలందరినీ బడిలో చేర్పేందుకు 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు.ఉపాధ్యాయులు వారి ప్రాంతంలో ఉన్న తల్లిదండ్రులకు చదువు యొక్క విశిష్టతను వివరించి,వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం 'స్టాప్ డయేరియా' కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో థిస్ ఇస్ పర్సన్ గా సెకండరీ గ్రేడ్ టీచర్ జి.శరత్చంద్ర వ్యవహరించారు.

జూన్ 30న వకుళమాత ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ :తిరుపతి రూరల్ మండలం పాతకాల్వ పంచాయితీ పేరూరు బండపై ఉన్న శ్రీ వకుళమాత ఆలయంలో జూన్ 30వ తేదీ వార్షికోత్సవ ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు టీటీడీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపింది.ఇందులో భాగంగా ఉదయం 8 గంటలకు మహాశాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారి ఉత్సవర్లకు అష్టోత్తర కలశాభిషేకం జరుగనుందని ఆ ప్రకటనలో తెలిపింది.

మత్తు పదార్థాలకు యువత బానిస కాకూడదు

విశాలాంధ్ర - పలమనేరు : మత్తు పదార్థాలకు యువత బానిస కాకూడదని పలమనేరు సీనియర్ న్యాయవాదులు ఎల్. భాస్కర్. సయ్యద్ ఇస్మాయిల్ . ఆరిఫ్ ఉల్లా ఖాన్.లు తెలిపారు.ఈ మేరకు పలమనేరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి. మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ పగడాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని తీర్థం కృష్ణయ్య శెట్టి జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును బుధవారం న్యాయవాదులు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల దుర్వినియోగం పై ఇంటర్నేషనల్ డ్రగ్స్ డే ను పురస్కరించుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు మత్తుపదార్థాల వాడకం వల్ల చిన్న మెదడు రక్తనాళాలు దెబ్బతినడంతో శరీర మొత్తం పాడైపోతుంది అన్నారు. మాదకద్రవ్యాలు వాడడం వల్ల 10 పాయింట్ 72% మంది మృతి చెందుతున్నారన్నారు. దీంతో వారి కుటుంబంలోని పెద్దలు ఎవరైనా మృతి చెందితే మిగిలిన కుటుంబ సభ్యులు ప్రక్కదావ పట్టి రోడ్డుపై పడుతున్నారన్నారు. ధూమపానం మద్యపానం లపై ఆరోగ్యానికి హానికరం అని వ్రాసిన వాటిని కూడా వాడి కొంతమంది వారి జీవితాలను ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. 1985 వ సంవత్సరంలో చట్ట ప్రకారం గంజాయిని పండించి వ్యాపారం చేసే వారిని అయితే రాష్ట్రపతిగా జ్ఞాని జెల్ సింగ్ వచ్చిన తర్వాత గంజాయి పై నియంత్ర చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు అయితే మన రాష్ట్రంలోని ఈస్ట్ వెస్ట్ నందు గల శ్రీకాకుళం విజయనగరం నుండి అక్కడ సాగుచేసిన గంజాయి ని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసి డబ్బు చేసుకుంటున్నారు అన్నారు. ప్రస్తుత నూతన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్లో మత్తు పదార్థాలు పై ప్రత్యేక దృష్టి సారించి డ్రగ్స్ అరికడతామని హోం మినిస్టర్ వంగలపూడి అనిత ఈ మధ్యనే మీడియా ద్వారా తెలిపారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మీద ఆ బాధ్యత ఉందన్నారు విద్యార్థులు యువత ఇతర సావాస దోషాలతో డ్రగ్స్ కు బానిసలు అవుతున్నారని అలాంటివారికి దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించి కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థి దశ నుండే మంచి అలవాట్లు నేర్చుకొని ప్రపంచవ్యాప్తంగా పేరొందిన అబ్దుల్ కలాం సరోజినీ నాయుడు ల మన దేశానికి ఉపయోగపడేలా నేర్చుకోవాలన్నారు మత్తుకు దూరంగా ఉంటేనే ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు సమాజంలో మెజారిటీ యువతని ఆర్థికంగా ఆరోగ్యకరంగా నష్ట పోకూడదన్నారు ఇప్పటికే మత్తు పదార్థాలు వినియోగం పెరిగిపోతుందని దీనికి కారణం యువత ఆట్రాక్ట్ అవుతుండడమే అన్నారు కళాశాలలో అవగాహన నిఘా లేకపోవడంతో గంజాయి కొకైన్ హెరాయిన్ లాంటి మత్తుపదార్థాలకు బానిసలు అవుతున్నారన్నారు అక్రమ రవాణా పై అధికారులకు పట్టణాలు గ్రామాలలో యువత కు విద్యార్థులు తెలిస్తే సమాచారం తెలపాలన్నారు. సముద్రం లోని అలలకు రూపు లేదని శిలలకు చూపు లేదని కలలకు రూపు లేదని ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల విజ్ఞతకు హద్దే లేదని న్యాయమూర్తులు విద్యార్థులను అభినందించారు.. కళాశాల ప్రిన్సిపల్ కన్నయ్య మాట్లాడుతూ మత్తు పదార్థాల దుర్వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించినందుకు న్యాయవాదులకు ధన్యవాదాలు ఆయన తెలిపారు న్యాయవాదులు పేర్కొన్న విషయాలును విద్యార్థులు గుర్తుపెట్టుకుని పాటించాలన్నారు ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి ఉన్నత స్థానానికి ఎదిగేందుకు విద్యార్థులందరూ కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపిఎస్ అమలు చేయాలి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ఏపీ సీపీఎస్ఈఏ తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో తరపున సిపిఎస్, జిపిఎస్ ను రద్దుపరిచి ఓపిఎస్ ను అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి వినతిపత్రం అందజేశారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఏపీ సిపిఎస్ ఈఏ తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా ప్రెసిడెంట్ ఆర్ దేవానంద్, జనరల్ సెక్రెటరీ పీ.వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టి. శ్రీనాథ్, శ్రీకాళహస్తి ప్రెసిడెంట్ వి. గంగయ్య పుంగనూరు నుండి మనోహర్ కలిసి సీఎంకి వినతిపత్రం అందజేశారు. ఏపీ సీపీఎస్ఈ ఏ తరపున సిపిఎస్, జిపిఎస్ను రద్దుపరిచి ఓపి ఎస్ ను అమలు చేయాలని కోరి, సంఘం తరపున రిప్రజెంటేషన్ సమర్పించారు. దానికి సీఎం చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి చేస్తాము అని హామీ ఇచ్చినట్లు సంఘ సభ్యులు తెలిపారు.

కోనేటి ఆదిమూలంను కలిసిన సర్పంచులు

విశాలాంధ్ర - బుచ్చి నాయుడు కండ్రిగ : సత్యవేడు నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను బుధవారం బి ఎన్ కండ్రిగ మండలం పార్లపల్లి సర్పంచ్ చలపతి, కొత్తపాలెం సర్పంచ్ కేతారి హరిప్రసాద్, సర్పంచ్ తదితర నాయకులు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి శ్యాలువతో ఆయన సన్మానించారు. ఎమ్మెల్యే గ్రామాల పరిస్థితులపై వారితో చర్చించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం లో మనకు అంతా మంచే జరుగుతుందని తెలిపారు. సమిష్టిగా మీరందరూ నా గెలుపుకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వీరితో పాటు సీనియర్ నాయకులు తోట దొర స్వామిరెడ్డి తదితరులు వున్నారు.

చెట్టు పై నుండి పడి యువకుడు మృతి

విశాలాంధ్ర - రామకుప్పం : ప్రమాదవశాత్తు చెట్టు పై నుండి కింద పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది పరిధిలోని బందార్ల పల్లి పంచాయతీ వినాయక పురం గ్రామంలో విషాద సంఘటన చోటు చేసుకుంది స్థానికులు మరియు మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వినాయక పురం గ్రామానికి చెందిన చంద్ర(30) అనే యువకుడు మంగళ వారం సాయంత్రం తాను పెంచుకుంటున్న గొర్రెలకు మేత కోసం ఇంటికి సమీపంలో ఉన్న వేప చెట్టులో ఆకు కోసేందుకు చెట్టు ఎక్కాడని ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడని వెంటనే స్పందించిన కుటుంబ సభ్యులు ఆటో ద్వారా కుప్పం పీఈఎస్ ఆసుపత్రి కి తరలిస్తుండగా మార్గమధ్యమైన శాంతిపురం సమీపంలో ప్రాణాలు కోల్పోయాడని ఇక చేసేది లేక మృత దేహాన్ని ఇంటివద్దకు తీసుకురావడం జరిగిందన్నారు అనంతరం జరిగిన సంఘటనపై రామకుప్పం పోలీసులకు మృతుని భార్య భువనేశ్వరి పిర్యాదు చేసిందని ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని ప్రభుత్వం ఆదుకోవాలని మృతుని కుటుంబ సభ్యులు కోరారు కాగా మృతదేహానికి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి తదితరులు తమ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు అనంతరం పది వేల రూపాయల నగదును వారి కుటుంబ సభ్యులకు అందజేసి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుని కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు నందారెడ్డి, ముని రెడ్డి, సుబ్రమణ్యం, మురళి, పెరుమాళ్, చంద్రశేఖర్ రెడ్డి, రంగనాథం, గోవర్ధన రెడ్డి, మని తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమావేశం

విశాలాంధ్ర - పాకాల : పాకాల మండలం వల్లివేడు గ్రామపంచాయితీ వల్లివేడు నందు నేడు విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహించనున్నట్లు రూరల్ ఏ ఈ జనార్దన్ రావు తెలిపారు.విద్యుత్ సమస్యల పరిష్కారం కొరకు వల్లివేడు సబ్ స్టేషన్ వద్ద వినియోగదారుల సమావేశం నిర్వహిస్తున్నామని విద్యుత్ సరఫరా, బిల్లుల చెల్లింపులలో సమస్యలు ఉన్నట్లయితే ఈ సమావేశంలో పాల్గొని తమ దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కారం పొందవచ్చని ఆయన తెలిపారు.

జ్యోతిరావు పూలే సర్కిల్ పునరుద్ధరించాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న జ్యోతిరావు పూలే సర్కిల్ ను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని భాజపా రాష్ట్ర కార్యదర్శి ఎం బాలకృష్ణ యాదవ్ అన్నారు. బుధవారం భాజపా బృందం కడప నగరంలో పాత బస్టాండ్ కూడలిని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కడప నగరంలోని పాత బస్టాండ్ కూడలి లో పెండింగ్లో ఉన్న జ్యోతిరావ్ పూలే సర్కిల్ ని పాత బస్టాండ్ ప్రాంగణంలోని వసతులను, లోటుపాట్లను సైతం భాజపా బృందం పరిశీలించడం జరిగిందనారు. భాజపా బృందంతో పాటు కడప నగరపాలక సంస్థ అధికారులు కూడా పాల్గొన్నారు. ఇందులో భాగంగా జ్యోతిరావ్ పూలే సర్కిల్ నిర్మాణం యుద్ధప్రాతిపదికన చేపట్టి వెంటనే పూర్తి చేయాలని అధికారులకు విన్నవించారు. పాత బస్టాండ్ ప్రాంగణంలో ప్రజల కోసం ఏర్పాటు చేసినమూత్రశాలలు డబ్బులు అధికంగా వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బస్టాండ్ ప్రాంగణంలో అనుమతి లేకుండా ఆక్రమణకు గురయిన ప్రాంతాలను వెంటనే ఖాళీ చేయించాలని, పార్కింగ్ విషయంలో ఒక నిర్దిష్టమైన ప్రణాళిక తయారు చేసి బస్సులకు మరింత విశాలంగా బస్టాండ్‌ను క్రమబద్ధీకరించే విధంగా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. అధికారులు కూడా ఎంతో సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డీఈ సునీల్ కుమార్, వారి సంబంధిత సిబ్బంది, భాజపా నాయకులు గోసుల శ్రీనివాసులు రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వి.వి.చలపతి, కళ్యాణ్ రాజ్, రవీంద్రనగర్ మండల భాజపా అధ్యక్షుడు వై. హరి నారాయణ రావు, భాజపా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శోభా భాయ్,భాజపా నాయకులు చంద్ర శేఖర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా సర్పంచ్ చర్యలు

విశాలాంధ్ర- పీలేరు : నీటి సమస్య తలెత్తకుండా సర్పంచ్ జీనత్ షఫీ సత్వర చర్యలు చేపట్టడంతో పీలేరు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.పీలేరు గ్రామపంచాయతీకి చెందిన పైపులైను మర్మతుకు గురి కావడంతో సర్పంచ్ షేక్ జీనత్ షఫీ సమాచారం తెలుసుకొని వెంటనే కొత్తపల్లి సంపు నుండి చిత్తూరు రోడ్డు మీదగా బండ్ల వంకకు నీరు వెళ్లే పైపులైను రోడ్డు పనుల కారణంగా పైపులైను పగిలిపోవడంతో నీరు వృధాగా రోడ్డుమీద పోవడంతో బండ్ల వంకా మరియు కోటపల్లి రోడ్డు గంగమ్మ గుడి వీధి రాముల వారి వీధి ప్రజలకు నీటి సమస్య రాకుండా పైపులైన్లు మరమ్మత్తులు చేసి నీటిని సరఫరా ను పీలేరు సర్పంచ్ షేక్ జీనత్ షఫీచేశారు.

విద్యాదానం చాలా శ్రేష్ఠమైనది

విశాలాంధ్ర -మదనపల్లి: స్థానిక రేఖ గార్మెంట్ అధినేత చొగాలాల్ సింగ్ పురోహిత్ మన చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలోని పిల్లలకు 23750/- రూపాయలు విలువ చేసే 82 స్కూల్ బ్యాగుల తో పాటు 20,000 రూపాయలు విలువ చేసే నోటు పుస్తకములు వితరణ చేశారు వితరణ చేశారు.చోగాలాల్ సింగ్ పురోహిత్ గారు ప్రతి సంవత్సరం మన సేవా సంస్థలో ఉన్న పిల్లలకు విద్యా సామాగ్రితో పాటు పండుగ రోజులలో తినుబండారాలు మరియు అవసరమైన వస్తువులు వితరణ చేస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ జి వి ఎస్ బాబు. జనరల్ సెక్రెటరీ కవిత రాణి ఈ సందర్భంగా చొగాలాల్ సింగ్ పురోహిత్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ముత్తు ఆంగ్ల మాధ్యమ పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఈనెల 29న లోక్ అదాలత్

విశాలాంధ్ర -కమలాపురం : స్థానిక జూనియర్ సివిల్ కోర్టు నందున ఈనెల 29వ తేదీన జాతీయలోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు స్థానిక మెజిస్ట్రేట్ లావణ్య బుధవారం ఓ ప్రకటన తెలియజేస్తూ క్రిమినల్. సివిల్. బ్యాంకు కేసుల్లో రాజీ ధోరణిలో ఉన్న కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కేసులను పరిష్కరించుకోవచ్చని ఆమె అందులో పేర్కొన్నారు. కోర్టు పరిధిలోని పోలీసులు సిబ్బంది కేసుల పరిష్కారం కొరకు తమ వంతు ప్రయత్నం చేయాలని మెజిస్ట్రేట్ అన్నారు.

జులై 1నుండి ఇంటి వద్దకే

సామాజిక భద్రత పింఛన్ పంపిణీ చేస్తాం:ఎమ్మెల్యే నల్లారి కిషోర్

విశాలాంధ్ర- పీలేరు : జులై 1వ తేదీ నుండి సామాజిక భద్రత పెన్షన్ అర్హులైన వారి ఇంటివద్దకే పంపిణీ కార్యక్రమం చేపడతామని, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు.ఆయన అసెంబ్లీలో శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తమ స్వగ్రామం నగిరిపల్లె కు రావడంతో టీడీపీ, బీజేపీ,జనసేన నాయకులు,కార్యకర్తలు నల్లారి అభిమానులు ఘన స్వాగతం పలికారు.పీలేరు నియోజకవర్గ ప్రజలు,కార్యకర్తలు, పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురావడంతో సానుకూలంగా స్పందించారు.ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో వృద్ధులు, వితంతువులకు "ఎన్టీఆర్ భరోసా" పేరుతో ఏప్రిల్,మే, జూన్,మూడు నెలలకు మూడువేలు, జులై నెల నాలుగు వేలు మొత్తం ?7,000 రూపాయలతో పాటు నూతన పాస్ బుక్ కూడా అందజేస్తామని,గ్రామ, వార్డు, సచివాలయ సిబ్బంది ద్వారా అందజేయడం జరుగు తుందని సూచించారు.ఆగస్టు 1 నుండి యధావిధిగా నాలుగు వేలు పెన్షన్ వస్తుందని అన్నారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలు కూడా అమలుకు త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు చేస్తామని అన్నారు.

హొటళ్ళపై ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ

నూనె, మసాలాలు నాణ్యత లేకపోవడంతో నోటీసులు

విశాలాంధ్ర - జమ్మలమడుగు :జమ్మలమడుగు పట్టణంలోని అభిరుచి, బృందా వన్ రెస్టారెంట్లను ఆకస్మికంగా జిల్లా ఆహార భద్రత అధికారి జి.ప్రభాకర్ తన బృందంతో కలిసి తనిఖీలు నిర్వహించారు. బుధవారం ఆయన జమ్మలమడుగు పట్టణంలోని పలు హొటళ్లను తనిఖీలు నిర్వహించి నోటీసులు అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు జమ్మలమడుగు హొటళ్లను తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలి పారు. జమ్మలమడుగు పట్టణంలో నాణ్యతలేని ఆహారం ప్రజలకు అందిస్తు న్నారని ఫిర్యాదు అందడంతో అభిరుచి, బృందావన్ రెస్టారెంట్లపై దాడులు జరిపారు. అభిరుచి రెస్టారెంట్లో నాణ్యతలేని నూనెలు వాడ డంతో పాటు కల్తీ దినుసులు, మసాలాలు వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అభిరుచి రెస్టారెంట్ యాజమాన్యాలకు నోటీసులను అందజేశారు.అలాగే అభిరుచి రెస్టారెంట్ లో ఉన్న ఆహారాన్ని సేకరించి నమూనాలను పరీక్షలకు పంపిస్తున్నామన్నారు. బృందావనం రెస్టారెంట్లో పరిశుభ్రత పై అధికారులు నోటీసులు అందజేశారు. నిబంధనలను పాటించని హొటళ్లపై కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ ఇన్స్పెక్టర్ మద్దిలేటి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిధుల అవకతవకలపై విచారణ జరపాలి

ఎస్టీయు రాష్ట్ర అదనపుప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా నిర్వహణ నిమిత్తం బద్వేలు నియోజకవర్గానికి కేటాయించిన ఎన్నికల నిధుల వినియోగంలో జరిగిన అవకతవకలు, ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని ఎస్టీయు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సాయంత్రం పోరుమామిళ్లలోని ఎస్టీయు భవన్ నందు నిర్వహించిన సమావేశంలో రమణారెడ్డి మాట్లాడుతూ ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు ఎన్నికల సిబ్బందికి తాగునీరు, భోజన వసతి, రవాణాసౌకర్యాలు, కనీస వసతులు కల్పించవలసి ఉందన్నారు.కానీ బద్వేలు నియోజకవర్గ ఫెలిసిటేషన్ కేంద్రంలో మాత్రం నిబంధనలకు నీళ్లు వదిలి సరియైన సౌకర్యాలు కల్పించకుండా, ఎన్నికల సిబ్బందిని నానాయాతనలు పడేలా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు రాష్ట్ర కౌన్సిలర్లు సుబ్రమణ్యం, చంద్రహాసరెడ్డి, రామక్రిష్టారెడ్డి, సీనియర్ నాయకులు బాలరాజు, వాకా చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, జనార్ధన్ శెట్టి, జిల్లా నాయకులు శ్రీనివాసులు, గురయ్య, కస్తూరి శ్రీనివాసులు, మండల నాయకులు రవీంద్రబాబు, పుల్లయ్య, వెంకటరెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ రెడ్డి శ్రీరంగనీతులు మానుకోవాలి :చమర్తి

విశాలాంధ్ర -రాజంపేట : శ్రీరంగనీతులు వల్లించడం జగన్మోహన్ రెడ్డి మానుకోవాలని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి 2019లో అధికారం చేపట్టిన మరుక్షణమే ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభించి అక్రమ కట్టడాల వంకతో అనేకమంది టీడీపీ నాయకుల భవనాలు కూల్చివేశారని, ఆయన ఎటువంటి అనుమతులు లేకుండా కనీసం భవనాల నిర్మాణాలకు ప్రభుత్వ కార్యాలయాలలో అర్జీలు కూడా సమర్పించకుండా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ విలాసవంతమైన భవనాలు నిర్మించు కొని ఇప్పుడు శ్రీరంగనీతులు వల్లిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో అధికారులు జగన్ అక్రమ కట్టడాలకు నోటీసులు ఇస్తుంటే తప్పులు కప్పిపుచ్చుకోవడానికి తెలుగుదేశం పార్టీకి చెందిన మంగళగిరి కేంద్ర కార్యాలయంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మానుకొని ప్రజా సమస్యలపై పోరాడి ప్రజాభిమానాన్ని చూరగొనేందుకు ప్రయత్నించాలని హితవు పలికారు. ఈ కార్యక్ర మంలో టిడిపి పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి కొప్పూరు సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్ర హ్మణ్యం నాయుడు, శవనవారి పల్లె సర్పంచ్ కోటయ్య నాయుడు, సీనియర్ నాయకులు జీవీ సుబ్బరాజు, తెలుగు యువత పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ, మలేరియాపై అవగాహన

విశాలాంధ్ర-సిద్ధవటం : సిద్ధవటం మండలం మాధవరం,1 గ్రామపంచాయతీ లక్ష్మీపురం, మహబూబ్,నగర్, గ్రామాలో బుధవారం మాధవరం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ పర్యవేక్షణలో డెంగ్యూ మలేరియా పై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శివ కుమార్ మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు, హెల్త్ సూపర్వైజర్ రమణయ్య, ఆరోగ్య కార్యకర్తలు ఆశ వర్కర్లు, పారిశు ద్ధ కార్మికులు పాల్గొన్నారు. డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ మాధవరం గ్రామపంచాయతీ నందు మహేష్ (11) అదే బాలుడికి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ కావడంతో బాలుడు ఆరోగ్యం పై కుటుంబ సభ్యులతో విచారించామని ఆరోగ్య వంతులుగా ఉన్నాడని డాక్టర్ శివకుమార్ అన్నారు,

కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దండి

జులై 18వ తేదీ నుండి ఆగస్టు 2 తేదీ వరకు జాతీయ కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమం: డిఆర్వో గంగాధర్ గౌడ్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : వైయస్సార్ కడప జిల్లాను కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని డిఆర్వో గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లోని కమాండ్ కంట్రోల్ రూమ్ లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో లెప్రసీ కేసెస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్సిడిసి)పై డి ఆర్వో గంగాధర్ గౌడ్ అధ్యక్షతన జిల్లా సమన్వయ కుష్టి వ్యాధి కమిటీ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్వో గంగా ధర్ గౌడ్ మాట్లాడుతూ... జాతీయ కుష్టు వ్యాధి గుర్తింపు అవగాహన కార్యక్ర మాన్ని (లెప్రసీ కేసెస్ డిటెక్షన్ క్యాంపెయిన్) జిల్లాలో వచ్చే నెల జులై 18వ తేదీ నుండి ఆగస్టు 2వ తేదీ వరకు మొత్తం 15 రోజులు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమం ద్వారా ఆశా, వాలంటీర్, సచివాలయ ఏ.ఎన్.ఎం లు ఇంటింటికీ వెళ్లి (డోర్ టు డోర్) సందర్శించి గృహములో ఉన్న ప్రతి ఒక్కరిని పరీక్షించి ఎవరికైనా శరీరంపై రంగు మారిన మచ్చలు, చర్మంపై స్పర్శ లేని మచ్చలు, చెవులపై వీపుపై ఎదపై నొప్పి లేని బుడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల రాలిపోవడం, కనురెప్పలు మూతపడక పోవడం, ముక్కు దిబ్బడ ముక్కులో నుండి రక్తం కారడం, తెలియకుండానే చేతులు కాళ్లలో బొబ్బలు రావడం, చేతి వేళ్ళు కాలు వేళ్ళు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం వంటి లక్షణాలు ఉంటే వాటిని కుష్టి వ్యాధి అనుమానిత లక్షణంగా గుర్తించి వారి దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు రిఫర్ చేస్తామన్నారు.ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులు వారిని పరీక్షించి ఎవరికైనా వ్యాధి నిర్ధారణ అయితే వారికి ఉచిత ఎండిటి మందులు ఆరు నెలలు లేదా సంవత్సర కాలము చికిత్స ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం డబ్ల్యు.హెచ్.ఓ. ప్రమాణాలను పాటిస్తూ అన్నిరకాల సౌకర్యాలు కల్పించిందని అందుకుతగ్గట్టు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిమగ్నం కావాలని అన్నారు. బీసీ,ఎస్టీ, ఎస్సీ హాస్టల్స్ లలో ప్రతి ఒక్క విద్యార్థికి ఎల్సిడిసి టెస్ట్ నిర్వహించాలని సోషల్ వెల్ఫేర్ అధికారికి సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో మార్నింగ్ ప్రేయర్ అసెంబ్లీలో లెప్రసీపై అవగాహన కలిగించేలా విద్యార్థులకు వివరించాలని జిల్లా విద్యాధికారికి సూచించారు. జిల్లాను కుష్టు వ్యాధి రహిత లక్ష్యంగా మార్చడానికి అందరూ కలిసికట్టుగా సమన్వయంతో ఎల్సిడిసి గుర్తింపు కార్యక్రమాన్ని జిల్లాలో జయప్రదం చేయవలసినదిగా తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. అంతకుముందు డిఆర్ఓ గంగాధర్ గౌడ్ లెప్రసీ క్యాంపెనింగ్ పోస్టర్ ను డిస్ట్రిక్ కోఆర్డినేటింగ్ కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ నాగరాజు, జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి (అడిషనల్ డీ.ఎం.హెచ్.ఓ)డాక్టర్ రవిబాబు, జిల్లా విద్యా అధికారి అనురాధ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ శ్రీలక్ష్మి, జెడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి , సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, మెప్మా పిడి సురేష్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. చంద్ర శేఖర్, డి.పి.ఎం.ఓ డా.శశి భూషణ్ రెడ్డి, డి.ఐ.ఒ డా ఉమా మహేశ్వర్ కుమార్, జిల్లా ఫిజియో థెరపిస్ట్ డా వి.వి మనోహర్, ఆర్.బి.ఎస్.కే మనోరమ, తదితరులు పాల్గొన్నారు.

బిటెక్ రవికి సన్మానం

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి అలియాస్ బిటెక్ రవికి సన్మానం లభించింది. ఆ మేరకు సింహాద్రిపురంలో బుధవారం మీ సేవా నిర్వాహకులు బిటెక్ రవిని దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భం గా పలు సమస్యలను వారు బిటెక్ రవి దృష్టికి తీసుకెళ్లారు. వీలైనంత వరకు సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చినట్లు వారు వెల్లడించారు. తమ సమస్యల పట్ల ఆయన సానుకూలంగా స్పందించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు అంజన్‌కుమార్, రాష్ట్ర మీసేవా సభ్యులు సునీల్‌కుమార్, ఆపరేటర్లు బాబా, చిన్న, నరేంద్ర, రమేష్ పాల్గొన్నారు.

ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి

విశాలాంధ్ర-తొండూరు: నాణ్యమైన దిగుబడి సాధించేందు కు ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించు కోవాలని వ్యవసా యాధికారి మధు సూదన్‌రెడ్డి అన్నారు. భూసార పరీక్షల కోసం మట్టి సేకరణ కార్యక్రమాన్ని బుధ వారం ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూములను బట్టి నమూనాలను వ్యవసాయ అధికారులకు అందిస్తే వారు పరీక్షలు జరిపి ఎలాంటి పంటలు వేసుకోవాలో సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. తద్వారా పంటలు దిగుబడి అధికంగా వచ్చి లాభాలు పొందుతారు అన్నారు ప్రతి రైతు భరోసా కేంద్రానికి 75 చెప్పునా మట్టి నమూనా పరీక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది కనుక రైతులు భూసార మట్టి పరీక్షలు ఆసక్తి ఉన్న రైతులు వారి ఆధార్ కార్డు తీసుకొని వచ్చి రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకొని మట్టి నమూనా సేకరించి మట్టి పరీక్షలు చేసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

ఇసుక రవాణాకు అడ్డుకట్ట

విశాలాంధ్ర - యర్రగుంట్ల : మండల పరిధి లోని హనుమన గుత్తి గ్రామ పంచాయతీ పరిధిలో గల పెన్నానది నుండి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న నేపథ్యంలో మండల రెవెన్యూ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. భారీ వాహనాల ద్వారా ఇసుకను తరలిస్తు న్న సమయంలో రోడ్లు ధ్వంసమవడమే కాకుండా నదిలో తాగునీటి సరఫరాకు ఉద్దేశించిన పైపులు దెబ్బతింటు న్నాయని పలువురు గ్రామ స్తులు అధికారులకు ఫిర్యాదు చేసిన కారణంగా మండల తాహసీల్దార్ సౌభాగ్యలక్ష్మీ పెన్నా నదిలోని రీచ్‌ల వద్దకు చేరుకొని వాస్తవ పరిస్థితులను గమ నించారు. వాహనాల రాకపోకలకు సౌలభ్యంగా ఏర్పాటు చేసుకున్న దారిని తొల గించారు. కార్యక్రమంలో డిప్యూటీ తాహసీల్దార్ రమణారెడ్డి, సర్వేయర్ లక్ష్మీనారాయణ, వీఆర్‌ఓలు, పాల్గొన్నారు.

హోటళ్లను తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్



విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణం లో ని పలు హోటళ్లను ము న్సిపల్ కమిషనర్ రఘు నాథ రెడ్డి తనిఖీ చేశారు. పలు హోటళ్లలో ఫ్రిజ్‌లో మాంసపు ఆహార పదా ర్థాలపై ని ల్వ ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని మున్సిపల్ సిబ్బంది నిర్వీర్యం చేశారు. హోటల్ యజమా నులు ఖచ్చి తంగా నిబంధనలు పాటించాలని, హోటళ్లలో అపరిశుభ్రత ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. ప్ర జలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు.

విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - జమ్మలమడుగు : విద్యార్థుల బంగారు భవిష్యత్తును మత్తు పదార్థాలు దొరలవాట్లు కాలరాస్తున్న యని వారి జీవితాలనుఅధోగతిపాలు చేస్తున్నాయని జమ్మల మడుగు బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బూతమా పురం సుబ్బారావు పేర్కొన్నారు. ఈ రోజు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా జమ్మలమడుగు పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు, అడ్వకేట్లు, ఎక్సైజ్ పోలీసులు మరియు స్థానిక పోలీసులు ప్రభుత్వ జూనియర్ కాలేజీ యాజమాన్యం తో కలిసి జమ్మలమడుగు పట్టణంలోని జూనియర్ కాలేజీ విద్యార్థులతో పట్టణంలో మాదక దవ్యాల వినియోగం వల్ల జరిగేఅనర్థాలు మరియు దుష్పరిణామా లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసులోనే మత్తు పదార్థాలకు మాదక ద్రవ్యాలకు బానిసలు అవ్వడం వల్ల వారి బంగారు భవిష్యత్తు దుర్భరంగా మారుతుందని, భవిష్యత్తుతో పాటు వారి ఆరోగ్యం కూడా చిన్న వయసు లోనే క్షీణించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత పదవులు అధిరోహించాలని, మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆయన విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ లత, ఎస్ఐ సుబ్బారావు, బార్ అసోసియేషన్ అడిషనల్ సెక్రటరీ నాగార్జున రెడ్డి, సభ్యులు, అడ్వకేట్లు సంధ్య, సురేంద్రా రెడ్డి, ఓబులేసు, కొత్తమాస్ భాస్కర్, జూనియర్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమోదం లేకుండా వైఎస్సార్ పేరు నామకరణం చేయడం సబబుకాదు

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణంలోని గతంలో కూరగాయల మార్కెట్‌కు ప్రజా ఆమోదం లేకుండా వైఎస్సార్ పేరు నామకరణం చేయడం సబబుకాదని టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దూరు వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు అందరి ఆమోదం లేకుండా కూరగాయల మార్కెట్‌కు వైఎస్సార్ పేరు పెట్టడం వల్ల నేడా ఆ పేరును తొలగించాల్సి వచ్చిందన్నారు. 2023లో కూరగాలయ మార్కెట్‌కు వైఎస్సార్ పేరును నామకరణం చేశారన్నారు. ఈ పేరు పట్ల అప్పట్లో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. దీంతో తాము పేరు మార్చాలంటూ ప్రజావ్యతిరేకతను తెలియజేయడానికి టీడీపీ, బిజెపి శ్రేణులతో కలిసి సుమారు 250 మందితో ర్యాలీ కూడా చేపట్టామన్నారు. అప్పట్లో వైసీపీ అగ్రశ్రేణి నాయకుల మెప్పు పొందేందుకు మున్సిపల్ పాలక వర్గం తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని ఆరోపించారు. అంతేకాదు శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న వారిపై కేసులు కూడా నమోదు చేయించారన్నారు. అధికారమదం తలకెక్కడంతో వైఎస్సార్ పేరును తొలగించకుండా పాలక వర్గం అడ్డుకుందన్నారు. కానీ దేవదేవుడి ఆశీస్సులతో రాష్ట్రంలో ఎన్డీయే అధికారం లోకి వచ్చిందన్నారు. పులివెందుల పట్టణం చుట్టూ రింగ్‌రోడ్డు కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేశారన్నారు. కానీ ఇందులో ఒక విగ్రహం నేలకొరిగితే పట్టించుకునే వారు కరువ య్యారన్నారు. ఇది వైఎస్సార్ కొడుకుగా జగన్‌మోహన్‌రెడ్డి కి తలవంపు కావా అని ప్రశ్నించారు. ఎప్పటికైనా ప్రజలకు ఆమోయోగ్యంగా ఏ పనిచేసినా అది శాశ్వతంగా ఉండిపో తుందన్నారు. కొంత మంది వెదవల వల్ల వైఎస్ కుటుంబ సభ్యులకు అపకీర్తి వస్తోందన్నారు. ఈ విషయం వైఎస్ కుటుంబ సభ్యులు గ్రహిస్తే మంచిదన్నారు. ఇప్పటికైనా పులివెందుల ప్రాంత ప్రజలపై వైసీపీ నాయకులకు నిజమైన ప్రేమాభిమానులు ఉంటే అభివృద్ధికి సహకరిం చాలన్నారు. ఒకవేళ సహకరించని నేపథ్యంలో తాము చేసే అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్డీయే నాయకులు మద్దూర వెంకటరామి రెడ్డి, శశిభూషణంరెడ్డి, తూగుట్ల మధు, మాబాషా,, నల్లగారి భాస్కర్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - జమ్మలమడుగు : ఫుడ్ ఇన్స్పెక్టర్ హరితా పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు రామాజి ఇమ్మానుయేలు తెలిపారు. మంగళవారం ఉదయం జమ్మలమడుగు పట్టణానికి వచ్చిన జిల్లా ఆహార భద్రత అధికారి ప్రభాకర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగులోని అభిరుచి హోటల్ పై ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించారని తెలిపారు. ఫుడ్ ఇన్స్పెక్టర్ హరిత అభిరుచి హోటల్ యజమాని నుండి డబ్బులు తీసుకుని వారికి అనుకూలంగా వ్యవ హరించారని ఆరోపించారు. నామమాత్ర తంగా ఇన్స్పెక్షన్ చేసి హోటల్ యాజమాన్యాలకు అనుకూలంగా రిపోర్టులు రాస్తే ప్రజలు నష్టపోతారని ఆయన వాపోయారు. ఫుడ్ ఇన్స్పెక్టర్ హరిత విధులు పట్ల నిర్లక్ష్యంగా వహిస్తూ హోటల్ యాజమాన్యాలతో కుమ్మక్కై ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. ఆమె పై శాఖా పరమైన మరియు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయన కోరారు.